హైదరాబాద్ వార్త

'ఓటు' ఎక్కడుంటే బెటర్?

-ఎన్యూమరేషన్ ఫాం తీసుకున్న "డబుల్" ఓటర్లలో గందరగోళం
-అటు ఊర్లో..ఇటు సిటీలోనూ సొంతిళ్లు
-ఓటు ఎక్కడ తీసేయాలనే కన్ఫ్యూజన్
-రెండూ ఉంటే అసలుకే ఎసరు పడుతుందన్న భయం
-స్పష్టత కోసం స్నేహితులు,బంధువులతో చర్చలు

హైదరాబాద్, జూన్ 30,ప్రభాతవార్త: ఆగట్టునుంటావా...నాగన్న ఈ గట్టునుంటావా అన్నట్టు ఏదో ఒక గట్టును ఎంచుకోకుంటే.. మొత్తంగా ఓటే మాయమైపోయే ముప్పు పొంచి ఉంది అటు ఊర్లో, ఇటు హైదరాబాద్‌లో ఓటు హక్కు కలిగిన వారి పరిస్థితి. రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐర్ ప్రక్రియ మొదలైంది. దీంతో డబుల్ ఓట్ల గురించి గట్టి చర్చలే జరుగుతున్నాయి. దీంతో చాలా మంది ఓటర్లలో కంగారు కూడా మొదలైంది. మరీ ముఖ్యంగా హైదరాబాద్లో ఉంటున్న వాళ్ళలో ఈ టెన్షన్ కనిపిస్తోంది. ఏపీ మూలాలు ఉండి ఇక్కడ స్థిరపడ్డ చాలా మందికి రెండు చోట్ల ఓట్లు ఉన్నాయి. అలాగే తెలంగాణ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి సిటీలో సెటిలైన వాళ్ళలో ఎక్కువ మందికి కూడా సొంత ఊళ్ళో.. హైదరాబాద్లో డబుల్ ఓట్లు ఉన్నాయి. ఇప్పుడు ఎస్ఐఆర్ ప్రక్రియ మొదలవడంతో వీళ్ళంతా ఏదో ఒక చోటును ఎంచుకోక తప్పని పరిస్థితి. అలాంటి వాళ్ళంతా ఇప్పుడు ఎక్కడ ఉంచుకోవాలి, ఎక్కడ వదులుకోవాలన్న కన్ఫ్యూజన్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఓటర్ ఎన్యూమరేషన్‌పై రకరకాల సందేహాలు, సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాదీల్లోనే ఈ గందరగోళం ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. సిటీ ఓటు ముఖ్యమా.? సొంతూరి ఓటు కావాల్నా అన్న విషయంలో చాలామంది ఎటూ తేల్చుకోలేకపోతున్నారన్న చర్చలు జరుగుతున్నాయి.

పార్టీల్లోనూ గుబులు..

గతంలో లాగా ఆడా...ఈడా అంటే సర్ తో అస్సలు కుదరదు. హైదరాబాద్లో ఓటు ఉన్నవాళ్ళు తమ సొంతూర్లో కూడా కొనసాగిస్తామంటే ఏదో ఒకటి ఎగిరిపోవడం ఖాయం. సరిగ్గా ఇక్కడే రాజకీయ పార్టీల్లో కూడా కొత్త భయాలు పెరుగుతున్నాయట. సిటీ, శివారు ప్రాంతాల్లో తమ మద్దతుదారులుగా ఉన్నవాళ్ళు ఊళ్ళకే ప్రయారిటీ ఇస్తే... ఇక్కడ ఇబ్బందులు వస్తాయని కొన్ని పార్టీల అధినాయకత్వాలు భయపడుతున్నట్టు తెలుస్తోంది. ఆవిషయంలో బీజేపీ నాయ కులైతే..... అందరికంటే ముందే ఓపెన్ అయి పోయారు. ఆంధ్రా మూలాలు ఉన్న వాళ్ళయినా, తెలంగాణ గ్రామీణ ప్రాంతాల వాళ్ళయినా ఎవరైనా సరే హైదరాబాద్ సిటీలో ఓటు ఉంటే మాత్రం అస్సలు వదులుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. ఊళ్ళలో సంగతి అక్కడి వాళ్ళకు వదిలేయండి గానీ.. మీ హైదరాబాద్ ఓటును మాత్రం అస్సలు వదులుకోవద్దని కోరుతున్నారు.. అందు కో ప్రత్యేకమైన కారణాన్ని కూడా చెబుతున్నారు సిటీ ఓటర్లలో హిందువులు మైనార్టీలు అయి పోతున్నారని గ్రేటర్ పరిధిలో ఉండే హిందువుల ఓట్లు గ్రామీణ ప్రాంతాలకు వెళ్ళిపోతే. హైదరా బాద్‌లో ప్రాబల్యం చూపలేరని పాతబస్తీలో ఇప్పటికే ఆ పరిస్థితి ఉందని, సిటీ మొత్తం అలాంటి స్థితి రానీయ వద్దని అంటున్నారు. కావాలంటే ఊళ్ళకు తర్వాత షిఫ్ట్ చేసుకోండిగానీ...ఇప్పుడు మాత్రం హైదరాబాద్లోనే నమోదు చేసుకోమని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే బిఆర్ఎస్, కాంగ్రెస్ సైతం తమ క్యాడర్ ఎక్కడా దెబ్బతినకుండా జాగ్రత పడుతున్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

పెండింగ్ ప్రాజెక్టులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

-ఏఓసీ ప్రాజెక్టు భూసేకరణ వేగవంతం
-ఉప్పల్ ఫ్లైఓవర్ ఫౌండేషన్ పనులకు ప్రాధాన్యం
- రామంతాపూర్ వైపు ఫ్లైఓవర్ నిర్మాణానికి సర్వే ఆఫ్ ఇండియా భూసేకరణ
-ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్, జూన్ 30 ప్రభాతవార్త నగరంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు యుద్ధప్రతిపాదికన పూర్తి చేయనున్నట్లు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం తార్నాకలోని ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏఓసీ ప్రాజెక్టుకు సంబంధించి రక్షణ శాఖకు చెందిన భూమికి బదులుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి 5.78 ఎకరాల భూమి కేటాయింపు, షామీర్‌పేట్‌లోని ఎల్ఎల్ఆర్ ప్రాంతంలో 153 ఎకరాల భూమి బదిలీ అంశంపై కమిషనర్ సమగ్రంగా చర్చించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్‌కు వెంటనే లేఖ పంపాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ఏఓసీ పనులు ప్రారంభించేందుకు అవసరమైన రైల్వే భూముల సేకరణ, భూసేకరణ విధానంపై అధికారులతో చర్చించారు. అలాగే ఎంఎంసి నూతన భవన నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ కన్సల్టెంట్‌తో రెండు రోజుల్లో సమావేశం నిర్వహించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. టిరెఆర్ ఫ్లైఓవర్ నిర్మాణం వల్ల ప్రభావితమయ్యే మొత్తం ఆస్తులపై సమీక్ష నిర్వహించారు. తక్కువ ప్రభావం ఉండే ప్రత్యామ్నాయ మార్గాన్ని గుర్తిస్తూ, నిర్మాణాల స్వభావం ఆధారంగా జాబితా సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశానికి హాజరైన ప్రభావిత భవనాల యజమానులతో కమిషనర్ చర్చించారు. వారిలో పలువురు టిడిఆర్ స్వీకరించేందుకు అంగీకరించి, అవసరమైన భవన భాగాన్ని అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. టీడీఆర్ స్వీకరించేందుకు ముందుకు వచ్చిన యజమానులకు ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్, చీఫ్ సిటీ ప్లానర్‌తో కలిసి పూర్తి సహకారం అందిస్తామని, టీడీఆర్ జారీ ప్రక్రియను వేగవంతం చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఆర్‌కే పురం ఆర్ఓబీ నిర్మాణం వల్ల ప్రభావితమయ్యే ఆస్తులపై సమీక్ష నిర్వహించి టీడీఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. మొత్తం 34 మంది ఆస్తి యాజమానులు టిడిఆర్ స్వీకరించేందుకు అంగీకరించగా, వారికి త్వరలోనే టిడిఆర్ జారీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఉప్పల్ ఫ్లైఓవర్‌కు సంబంధించి మిగిలిన ఫౌండేషన్ పనులను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఉప్పల్ జోనల్ కమిషనర్ ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ పనులు, భూసేకరణ పురోగతిపై వివరించారు. ముఖ్యంగా రామంతాపూర్ వైపు ఫ్లైఓవర్ నిర్మాణానికి అవసరమైన సర్వే ఆఫ్ ఇండియా భూమి సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించారు. ఈ సమావేశానికి జోనల్ కమిషనర్లు, చీఫ్ సిటీ ప్లానర్, సిటీ ప్లానర్లు, భూసేకరణ అధికారి, ఇంజినీరింగ్ ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

ట్రస్టు బోర్డు ఏర్పాటుపై నీలి నీడలు

- శ్రీజగదాంబికా మహంకాళి అమ్మవారి ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై అధికారుల మల్లగుల్లాలు.
-7 మంది సభ్యులకు గాను 15 మంది దరఖాస్తు.
- ఉత్సవాలు దగ్గర పడుతుండడంతో ఆశావాహుల్లో టెన్షన్ టెన్షన్
- ట్రస్ట్ బోర్డు సభ్యుల పేర్లను వెంటనే ప్రకటించాలని పలువురి డిమాండ్

మెహదీపట్నం, జూన్ 30, ప్రభాతవార్త : చారిత్రాత్మకమైన గోల్కొండ శ్రీ జగదాంబికా మహంకాళి అమ్మవారి ట్రస్ట్ బోర్డు ఏర్పాటు పై నీలి నీడలు కమ్ముకున్నాయి. బోనాల ఉత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాల్సిన దేవాదాయ శాఖ అధికారులే ట్రస్ట్ బోర్డు ఏర్పాటు పై అలసత్వం వహించడం విడ్డూరంగా ఉందంటున్నారు భక్తులు. గోల్కొండ బోనాల ఉత్సవాలు ప్రారంభమవడానికి 15 రోజుల గడువు మాత్రమే ఉండడంతో ఆశావాహుల్లో టెన్షన్ నెలకొంది. గత ఏడాది గోల్కొండ బోనాల ఉత్సవాల ట్రస్ట్ బోర్డును 45 రోజుల ముందే ప్రకటించిన అధికారులు ఈ ఏడాది మాత్రం నేటికీ ప్రకటించకపోవడం పలు సందేహాలు కలుగుతున్నాయి.తెలంగాణలో ఆషాడ మాస బోనాల ఉత్సవాలు చారిత్రాత్మకమైన గోల్కొండ కోట నుంచే ప్రారంభమవుతాయి. గోల్కొండ కోటపై కొలువుదీరిన శ్రీ జగదాంబికా మహంకాళి అమ్మవారికి ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో తొలి బోనం, పట్టు వస్త్రాలను సమర్పిస్తుండడంతో నగరం నలుమూలల నుంచే కాకుండా తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. లక్షలాది మంది భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ట్రస్ట్ బోర్డు సభ్యులపై ఉంటుంది. అలాంటి ట్రస్టు బోర్డును ఏర్పాటు చేయడంపై దేవాదాయ శాఖ అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదని పలువురు ఆశావాహులు, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోల్కొండ బోనాల ఉత్సవాల ట్రస్ట్ బోర్డు ఏర్పాటు కోసం దేవాదాయ శాఖ అధికారులు ఈనెల 8 సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరించగా తేదీ 28 ఆదివారం చివరి నాటికి 15 మంది దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ మంత్రి స్పందించి ట్రస్టు బోర్డు సభ్యుల పేర్లను ప్రకటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు బోనాల ఉత్సవాల ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు కృషి చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తు చేసుకున్న ఆశావాహులు.

1.ఆకుల చంద్రశేఖర్ 2.దూసరి వివేక్ 3.జి.భరత్ 4.గుండ్యాల దినేష్ 5.వీరాస్వతి 6.గీత 7.శ్యామల 8.భోగిబాలదాస్ 9.మహేందర్ కుమార్ 10.నర్సింగ్ రావు 11.హిరేందర్ 12.హేమలత 13.మోహన్ రావు 14.సచిన్ కుమార్ 15.రాధారాణి

సరూర్‌నగర్‌లోని ఇంట్లో అనుమానాస్పద పేలుడు

పేలుడు దాటికి ధ్వంసమైన వంటగది

హుడాకాంప్లెక్స్,30 జూన్, ప్రభాతవార్త : మహేశ్వరం నియోజకవర్గం, సరూర్‌నగర్ డివిజన్‌లోని బాపూ నగర్‌లోని ఓ ఇంట్లో అనుమానస్పదమైన పేలుడు సంభవించిం ది. ఈ పేలుడు ధాటికి వంటగది పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు గోడకూలి, వస్తువులు చిందరవందరగా పడ్డాయి. వివరాల్లోకి వెలితే దేవరశేట్టి దేవేందర్ అనే వ్యక్తి విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి. 1993లో ఈయన బాపూనగర్‌లోని రోడ్డు నెంబరు 4లో ఇక ఇంటిని కొనుగోలు చేశాడు. 2007లో పేలుడు జరిగిన పైఅంతస్తును రినేవేషన్ కూడా చేయించాడు. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు అందరు అల్పాహారం చేసి హాల్‌లో కూర్చు న్నారు. 10.45 నిమిషా ప్రాంతంలో ఒక్కసారిగా వంటగదిలో బారీ పేలుడు సంభంవించింది. పేలుడు దాటికి వంటగది కిటికి ఎగిరి ఇంటిబయట రోడ్డుపై పడింది. గోడకూలి వస్తువులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి.హాల్‌లోని కిటీకి అద్దాలు కూడా ధ్వంసం అయ్యాయి. వంటగదిలో ఉన్న ఇంట్లో ఉన్న నిండు సిలిండర్లు పేలకపోవడం గమనార్హం.ఒకవేళ అవి పేలిఉంటే ప్రమాదతీవ్రత ఏస్థాయిలో ఉండేదో ఊహించలేము. ఈ హఠాత్పరిణామానికి ఇంట్లోని కుటుంబసభ్యులు, కాలనీ వాసులు ఒక్క సారిగా ఉలిక్కి పడ్డారు.ఎటువంటి ప్రాణనష్టం జరుగక పోవడం తో అందరు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న ఎల్బీ నగర్ ఏసిపి క్రిష్ణయ్య, సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం సిబ్బంధి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. డాగ్‌స్కాడ్, క్లూస్‌టీం అక్కడికి చేరుకుని సంఘటనాస్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రాథమికంగా గ్యాస్ లీక్ అవడంతోనే పేలుడు సంభవించిందని ఏసిపి పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

దుండిగల్, జూన్ 30, ప్రభాతవార్త

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజన చేపట్టిన వన్ వార్డ్ ఎవ్రీ డే కార్యక్రమంలో భాగంగా మంగళవారం కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని దుండిగల్ సర్కిల్-59 లోని వార్డు నంబర్-296లో విస్తృతంగా పర్యటించారు. స్థానిక ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, అభివృద్ధి పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ పర్యటన సందర్భంగా కేవీఆర్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం, నాగలూరు గ్రామానికి నూతన రహదారి ఏర్పాటు, దుండిగల్ గ్రామంలో ఇంటి నంబర్ల జారీ, ఆస్తి పన్ను తగ్గింపు ప్రక్రియ వేగవంతం చేయడం, ఐఏఆర్ఈ కళాశాల నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు వీధి దీపాల ఏర్పాటు, శంభీపూర్ గ్రామంలో పారిశుధ్య నిర్వహణ మెరుగుదల, ఖాళీ స్థలాల్లో పిల్లల కోసం ఆట స్థలాల ఏర్పాటు, దుండిగల్ ఎస్సీ బస్తీలో సీసీ రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న ఆక్రమణల తొలగింపు, గగిలాపూర్ సర్వే నంబర్-214లో స్మశానవాటికకు కాంపౌండ్ వాల్ నిర్మాణం, దుండిగల్ గ్రామంలో అవసరమైన ప్రాంతాల్లో కొత్త సీసీ రోడ్ల నిర్మాణం వంటి అంశాలను కమిషనర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ శ్రీజన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎస్ఎల్ఏ నిబంధనల ప్రకారం నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇంటి నంబర్ల జారీ, పన్ను తగ్గింపు, ఇంజినీరింగ్ పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, ఖాళీ స్థలాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యం, డ్రైనేజీ, వర్షపు నీటి నిల్వలు వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఏఎల్ఓ కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి. శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ ఇంజనీర్ పాపమ్మ, ఎస్‌డబ్ల్యూఎం డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, ఏఎంసీ లక్ష్మయ్య, అసిస్టెంట్ ఇంజనీర్లు బి. సురేందర్ నాయక్, అశోక్ కుమార్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సృజన



నిమ్స్‌లో ఉద్యోగుల పదవీవిరమణ

జూబ్లీహిల్స్, జూన్ 30, ప్రభాతవార్తః నిమ్స్ ఆసుపత్రిలో సుధీర్ఘకాలంగా సేవలందించిన 16 మంది ఉద్యోగులు మంగళవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్, డీన్ ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ పరంజ్యోతి కలిసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులు నిమ్స్ అభివృద్ధిలో, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. వారి సేవలు సంస్థకు చిరస్మరణీయమన్నారు. పదవీ విరమణ పొందిన వారిలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా. సుధారాణి, లెక్చరర్ టి. సుధా, డిప్యూటీ రిజిస్ట్రార్ ఇన్‌చార్జ్ ఫైనాన్షియల్ కంట్రోలర్ కరణం మోహన్, బయోమెడికల్ ఇంజనీర్ మల్లికార్జునరావు కొనేరు, నర్సింగ్ అధికారులు పారిజాతం సురేపల్లి, లక్ష్మీ దేవమ్మ మేక, కె. శాంతమ్మ, వెంకమ్మ కోటి, సీనియర్ ఏఎన్ఎమ్ ఎడా చరిత, టెక్నికల్ ఆఫీసర్ ఈ. రాధాదేవి, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-1 శ్రీనివాసరావు వలిచెర్ల, డీపీఏ గ్రేడ్-బి జయరాం రెడ్డి కోటు, ఆర్. సుకన్య, ఆఫీస్ సూపరింటెండెంట్ కె. సాంబన్న శాస్త్రి, సెక్రటేరియల్ అసిస్టెంట్ షమీమ్ బేగం, క్లాస్ 4 ఉద్యోగి పాషా ఉన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ దయాకర్, మీడియా రిలేషన్ అధికారి సత్యగౌడ్, అలైడ్ సైన్స్ కాళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, హెచ్ఆర్‌డీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జర్దా తయారి గోదాంపై దాడులు

మైలార్‌దేవ్‌పల్లి,జూన్ 30 ప్రభాతవార్త : నిబంధనలకు విరుద్ధంగా కాటేదాన్ గణేష్ నగర్‌లోని ఓ గోదాంలో జర్దా తయారు చేస్తున్నట్లు సమాచారం అంద టంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దాడి జరిపారు..ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం.....గణేష్ నగరంలోని ఓ గోదాంలో నిబంధనలకు విరుద్ధంగా జర్దా తయారు చేస్తున్నారు.,గోదాంలోతయారైన జర్దాను బేగం బజార్‌కు చెంది న సయ్యద్ జమీల్,జీతు మిశ్రలు కలిసి చిన్న,చిన్న ప్యాకెట్లలో నింపి షాపులకు, చిన్న,చిన్న పాన్ షాపులకు సరఫరా చేస్తున్నారు.వారి వద్ద నుంచి 20 కిలోల జర్దా,110 డ్రమ్ముల జర్దా తయారు చేసే రెండు మిషన్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

3వేల కుటుంబాలకు ఊరటనిచ్చిన హైడ్రా

-1166 గజాల పార్కు స్థలానికి హైడ్రా ఫెన్సింగ్

హైడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన దృశ్యం

హైదరాబాద్, జూన్ 30,ప్రభాతవార్త: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం, బోడుప్పల్ గ్రామ పరిధిలోని టెలిఫోన్ కాలనీలో ఉన్న1166 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా మంగళవారం కాపాడింది. పార్కును కాపాడి.. 3 వేల కుంటుంబాలు, 10 వేల మంది నివాసితులకు హైడ్రా ప్రాణవాయువును అందించింది. వివరాల్లోకి వెళ్తే.. 1974లో గ్రామపంచాయతీ లే ఔట్‌గా టెలిఫోన్ కాలనీ ఏర్పడింది. ఇందులో 1166 గజాల స్థలాన్ని పార్కుగా కేటాయించారు. ఈ పార్కు స్థలాన్ని 6 బాగాలుగా చేసి కబ్జాలకు అక్కడ కొంతమంది ప్రయత్నించారు. కాలనీవాసులు పార్కుగా అభివృద్ధి చేస్తుంటే.. కబ్జాదారులు ఆటంకాలు సృష్టిస్తూ వచ్చారు. ఇదే విషయమై హైడ్రా ప్రజావాణిలో టెలిఫోన్ కాలనీ నివాసితులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను హైడ్రా లోతుగా విచారించింది. సంబంధిత శాఖలతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించింది. బోడుప్పల్ గ్రామంలోని సర్వే నంబరు 78, 79 లో ఈ కాలనీ ఏర్పడినట్టు నిర్ధారించింది.గ్రామపంచాయతీ లే ఔట్ అయినప్పటికీ ఇందులో ప్లాట్లు, భవనాలకు ఎల్ ఆర్ఎస్, బీఆర్ఎస్ అనుమతులు కూడా మంజూరయ్యాయి. పార్కు పక్కనే ఉన్న ప్లాట్ల సేల్ డీడ్‌లను పరిశీలించగా.. పార్కు స్థలం హద్దులున్నట్టు నిర్ధారణ అయ్యింది. ఆమోదిత లేఅవుట్, రిజిస్టర్డ్ పత్రాలు, క్షేత్రస్థాయి పరిశీలన, కాలనీ నివాసుల వాంగ్మూలాల ఆధారంగా 1,166 చదరపు గజాల ఈ స్థలం పూర్తిగా పార్కు స్థలమేనని హైడ్రా నిర్ధారించింది. ఆక్రమణదారులు ఏర్పాటు చేసిన అనధికారిక ఫెన్సింగ్‌ను హైడ్రా తొలగించింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. అలాగే హద్దులు నిర్ధారించి హైడ్రా ఫెన్సింగ్ వేసింది.

ఎన్యూమరేషన్ పత్రాలు ప్రతి ఇంటికి అందాలి

-బిఎల్ఓలకు ప్రజలు సహకరించాలి
-జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా

కార్వాన్‌లో బిఎల్ఓల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

హైదరాబాద్,జూన్ 30,ప్రభాతవార్త: జిల్లాలో ఇంటింటికి వచ్చే బిఎల్ ఓ లకు పూర్తిగా సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంకల అన్నారు. మంగళవారం కార్వాన్ నియోజకవర్గం లో గోల్కొండ పరిధిలో 277 పోలింగ్ బూత్ పరిధిలో బి.ఎల్. ఓ ల ద్వారా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్) ఎన్యూమరేషన్ ఫారంలు పంపిణీ ప్రక్రియను పరిశీలించి సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. బి.ఎల్.ఓ ల ద్వారానే ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీ జరగాలని ఏఈఆర్ ఓ లను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని ఈ.ఆర్ ఓ కార్యాలయాలలో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఓటర్లు ఏమైనా సమస్యలు ఉంటే అక్కడికి వెళ్లి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. నియోజక వర్గంలో ప్రతి ఇంటి నుండి మంచి స్పందన లభిస్తుందని కార్వాన్ నియోజక వర్గంలో 41 పోలింగ్ కేంద్రాల పరిధిలో దాదాపు 40 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు ఇంటింటికి వెళ్లి బి.ఎల్. ఓ లు అందచేయడం జరిగిందన్నారు. ఏ.ఆర్.ఓ లు ఆయా నియోజక వర్గాల పరిధిలో ఎన్యూమరేషన్ పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి కుటుంబంలో అర్హత ఉన్న ఓటర్లకు పత్రాలు అందచేయాలని అలాగే నమోదు పిదప స్వీకరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్ఓ/ తహసీల్దార్ ఏ.ప్రవీణ్, నోడల్ అధికారి నవీన్ కుమార్, డి.టి విజయకుమార్, జిహెచ్ఎంసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ట్యాక్స్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ఏ.పి.దహిమా, పి.వి.నారాయణరావు

ట్యాక్స్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త: ట్యాక్స్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఏ.పి.దహిమా, కార్యదర్శిగా పి.వి.నారాయణరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ 55వ వార్షిక సర్వసభ్య సమావేశం మంగళవారం బషీర్‌బాగ్‌లో పూర్వ అధ్యక్షులు సి.ఎ.చంద్రశేఖర్ వేముల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ వేముల 2025-26 సంవత్సర వార్షిక నివేదికను ప్రవేశపెట్టి, అసోసియేషన్ నిర్వహించిన వివిధ కార్యక్రమాలు, సాధించిన విజయాలు తదితర కార్యక్రమాలను వివరించారు. అనంతరం ట్యాక్స్ బార్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులతో పాటు సంయుక్త కార్యదర్శిగా సి.ఏ.నాగ ప్రవల్లిక వేముల, కోశాధికారిగా సీఏ పంకజ్ సంచేటి, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులుగా అడ్వకేట్ ఎన్.వి.చారి, సోమేశ్వర్ నెమ్మాని, ప్రకాష్ చచోక్కా, శైలేందర్ శర్మ, పంకజ్ చందక్, లీలా కృష్ణ మోహన్, ఆశిష్‌జోషి లు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎన్నికల పరిశీలకులు రామ్‌దేవ్ భుటాడా, అమృత్‌కుమార్ కోట సమక్షంలో ఎన్నికల అధికారి హితేష్‌జైన్ ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ధన్యవాదములు తెలియచేస్తూ, ట్యాక్స్ బార్ అసోసియేషన్ సాంప్రదాయాలను కొనసాగిస్తూ, సభ్యుల సంక్షేమానికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టటం తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం ట్యాక్స్ బార్ అధికారిక లాపెల్ పిన్ ను ఆవిష్కరించారు.

ఉద్యోగుల హక్కుల కోసం స్వామినాథం పోరాటం

గన్‌ఫౌండ్రి,జూన్ 30ప్రభాతవార్త: తెలంగాణ నాన్ గజిటెడ్ ఉద్యోగుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన గొప్ప నాయకుడు ఎం. స్వామినాథం అని కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ఎస్. ఎం.ముజీబ్‌హుస్సేనీ అన్నారు.దివంగత కేంద్రం సంఘం మాజీ అధ్యక్షులు ఎం.స్వామినాథం వర్ధంతిని పురస్కరించుకుని నాంపల్లి లోని హైదరాబాద్ జిల్లా కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎం.స్వామినాథం చిత్రపటానికి,జిల్లా అధ్యక్షులు ఎం .విక్రమ్‌కుమార్,ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్,టిఎన్‌జిఒ ప్రతినిధులతో కలిసి కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. ముజీబ్ హుస్సేనీ పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులహుక్కుల సాధన కోసం వారి సంక్షేమం కోసం,అలుపెరగని పోరాటం చేసిన ఆసాధారణ నాయకుడు స్వామినాథం అని కొనియాడారు.టిఎన్‌జిఒ యూనియన్‌ను బలోపేతం చేయడంలో ఆయన పోషించినపాత్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు.ఈకార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులుకె.ఆర్.రాజ్‌కుమార్,సంయుక్త కార్యదర్శి జి.గీతా, ముఖీం ఖురేషీ,ఎ.వి.శ్రీధర్,మహ్మద్‌షహిద్,మహ్మద్ ముస్తాఫా పాల్గొన్నారు.

రాబోయేది డబుల్ ఇంజిన్ వికసిత్ సర్కార్...

బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్‌కు తెలంగాణ చరిత్ర పుస్తకాన్ని అందజేస్తున్న బిజెపి మాజీ జిహెచ్‌ఎంసి ఫ్లోర్‌లీడర్ జి.శంకర్‌యాదవ్,గోల్కొండ జిల్లాఅధ్యక్షులు టి.ఉమా మహేంద్ర,గోవిందర్‌రాజు

బేగంబజార్,జూన్30ప్రభాతవార్త: రెండున్నర్లే తర్వాత తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారం చేపట్టడంఖాయమని బిజెపి జిహెచ్‌ఎంసి మాజీ ఫ్లోర్‌లీడర్ గొంటిశంకర్‌యాదవ్,గోల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులుటి.ఉమా మహేంద్ర అన్నారు.తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా బిజెపి జాతీయ అధ్యక్షులునితిన్ నబిన్ మర్యాద పూర్వకంగా కలిసి తెలంగాణ చరిత్రతో కూడిన పుస్తకాన్ని శంకర్‌యాదవ్, ఉమా మహేంద్ర,గోవిందర్‌రాజులు అందచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 ఏళ్ల కాలంలో దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించినట్లు వారు తెలిపారు.డబుల్ ఇంజన్ సర్కార్‌తో వికసిత తెలంగాణ అన్నట్లు చెప్పారు.ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణలో పాల్గొన్న బిజెపి శ్రేణులు

ఆల్విన్ కాలనీలో సర్ కార్యక్రమంలో పాల్గొన్న అల్లూరి రామరాజు

కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 30, ప్రభాతవార్త

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఓటరు జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా బిజెపి శ్రేణులు మంగళవారం బిఎల్ఓ మిత్ర విందాతో కలిసి బిఎల్ఎలు అల్లూరి రామరాజు ఉమాకాంత్ ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా కొత్త ఓటర్ల నుండి ఫారం6 స్వీకరించి, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని బి ఎల్ఓకి సూచించారు. అనంతరం అల్లూరి రామరాజు మాట్లాడుతూ 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలనీ ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధం అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యత మనందరిపై ఉంది అన్నారు. సర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అడ్రస్ మార్పు, కరెక్షన్ల కోసం ప్రజలు ఫారం6, 7, 8 లను తమకు అందజేయవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గడువులోగా పెన్షన్‌దారులు లైవ్ ఆథెంటికేషన్ చేసుకోవాలి

-డిప్యూటీ కమిషనర్ మల్లయ్య

అత్తాపూర్ జూన్ 30 ,ప్రభాతవార్త : పెన్షన్ లైవ్ ఆథెంటికేషన్ చేసుకొని లబ్ధిదారులు వెంటనే చేసుకోవాలని ప్రజలకు డిసి మల్లయ్య విజ్ఞప్తి చేశారు.మంగళవారం అత్తాపూర్ సర్కిల్ డిసి మల్లయ్య మాట్లాడుతూ..పెన్షనర్స్ లైవ్ ఆథెంటికేషన్ జూలై 2వ తేదితో ముగిస్తుందని కావున అర్హులైన లబ్ధిదారులు ఎవ్వరైనా ఇప్పటివరకు లైవ్ ఆథెంటికేషన్ పూర్తి చేయని వారు ఉంటే అత్తాపూర్ సర్కిల్ కార్యాలయంలో అవసరమైన పత్రాలతో గడువులోగా తప్పనిసరిగా సందర్శించి ఆథెంటికేషన్ చేసుకోవాలని కోరారు.లైవ్ ఆథెంటికేషన్ పూర్తి చేయని లక్ష్యంలో పెన్షన్ పంపిణీలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని బుధవారం ,గురువారం ఉదయం 10:30 గంటల నుండి 5 గంటలకు అధికారులు అందుబాటులో ఉంటారని లబ్ధిదారులు చేసుకోవాలని సూచించారు.

సర్ ప్రక్రియలో భాగంగా కవాడిగూడలో ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందచేస్తున్న జోనల్ కమిషనర్ మంగతాయరు, డిప్యూటి కమీషనర్ పుష్పలత

ఫీజు రీయంబర్స్‌మెంట్ సాధించే వరకు పోరాడదాం : జాజుల శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త: ఫీజు రీయంబర్స్‌మెంట్ సాధించే వరకు పోరాడుదామని బీసీ జేఏసీ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద పాత పద్ధతిలోనే ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని అమలుచేయాలని, తక్షణమే పెండింగ్ ఫీజుల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జులై 2న బీసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర వ్యాప్త కళాశాలల బంద్ గోడప్రతులను ఆయన టీఆర్ఎస్ శాసనమండలి ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూదనాచారి, సీపీఐ నాయకులు అజీజ్‌పాషా, బీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జకృష్ణలతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు బడ్జెట్‌లు ప్రవేశపెట్టినప్పటికీ రాష్ట్రంలోని 14 లక్షల మంది పేద ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ విద్యార్థులకు రావల్సిన ఏడు వేల కోట్ల ఫీజుల బకాయిలను విడుదల చేయకుండా పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేయాలని కుట్రలు చేస్తోందని ఆరోపించారు. పాత పద్ధతిలోనే ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకం అమలుచేసే వరకు పోరాటం ఉధృతం చేస్తామని, అందులో భాగంగానే జులై 2న రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలల బంద్, జులై 15న బీసీ విద్యార్థుల ఛలో హైదరాబాద్ కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. మధుసూదనాచారి మాట్లాడుతూ ఫీజురియంబర్స్‌మెంట్ విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక తప్పిదానికి పాల్పడుతోందని అన్నారు. బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జులై 2న చేపట్టిన కళాశాలల బంద్‌కు బీఆర్ఎస్ పార్టీ పక్షాన సంపూర్ణ మద్దతు తెలియచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు పాల్గొన్నారు.

కాలేజీ బంద్ గోడప్రతులను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నేతలు

గ్రామదేవతల ఆలయాలు ప్రజల ఐక్యతకు, సామాజిక సామరస్యానికి ప్రతీక : వెన్నెల గద్దర్

చిక్కడపల్లి జూన్ 30 (ప్రభాతవార్త) : తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలు మన సమాజానికి మూల స్తంభాలని తెలంగాణ సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ అన్నారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్ జవహర్ నగర్ ఎస్సార్టీ క్వార్టర్స్ శ్రీ నల్లపోచమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం చైర్మన్ బింగి సాయికీర్త్ (బాబ్జీ) స్వాగతం పలికి ప్రత్యేక పూజలకు ఏర్పాటు చేశారు. అనంతరం వెన్నెల గద్దర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, తెలంగాణ మరింత అభివృద్ధి సాధించాలని ఆమె అమ్మవారిని ప్రార్థించారు. గ్రామదేవతల ఆలయాలు ప్రజల ఐక్యతకు, సామాజిక సమరస్యానికి ప్రతీకలని పేర్కొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పిలుపునిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ బింగి సాయికీర్త్ (బాబ్జీ) మాట్లాడుతూ, వెన్నెల గద్దర్ ఆలయాన్ని సందర్శించి అమ్మవారి ఆశీస్సులు పొందడం భక్తులకు ఆనందాన్ని కలిగించిందన్నారు. ఆలయ అభివృద్ధికి అందరి సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మరిశెట్టి నర్సింగ్‌రావు, గుండు జగదీష్, నరేందర్ యాదవ్, కరుణాకర్ యాదవ్, భాస్కర్ రెడ్డి, హఫీజ్, ఇర్షాద్ తదితరులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీ నల్లపోచమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్ వెన్నెల గద్దర్

అంజయ్య నగర్ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి అధికారుల చర్యలు

చిక్కడపల్లి జూన్ 30 (ప్రభాతవార్త) : అడిక్ మెట్ డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్ బస్తీలో చాలా కాలంగా కొనసాగుతున్న డ్రైనేజీ సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మంగళవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి బస్తీ ని సందర్శించారు. బీజేపీ అడిక్ మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్, స్థానికులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రావడంతో ఆయన వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఎమ్మెల్యే వెంట జలమండలి జనరల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ విష్ణువర్ధన్ రావు, అధికారులు శివ, జ్యోతి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఇంజినీర్ గీత పాల్గొన్నారు. అధికారులు డ్రైనేజీ లైన్ల పరిస్థితిని పరిశీలించి సమస్యకు గల కారణాలను గుర్తించారు. డ్రైనేజీ నీరు నిల్వ ఉండకుండా, మురుగునీటి ప్రవాహం సక్రమంగా జరిగేలా అవసరమైన మరమ్మతులు, శుభ్రపరిచే పనులను అత్యవసరంగా చేపట్టాలని నిర్ణయించారు. బీజేపీ అడిక్మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్ మాట్లాడుతూ అంజయ్య నగర్ బస్తీలో డ్రైనేజీ సమస్యను స్థానికులు పలుమార్లు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం వల్లే శాశ్వత ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. బి ఆర్ ఎస్ నేతలు నేత శ్రీనివాస్, కె.మాధవ్, బీజేపీ నాయకులు, బస్తీవాసులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

అడిక్ మెట్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ బస్తీలో పర్యటిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ , చిత్రంలో బీజేపీ అడిక్ మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయి కృష్ణ యాదవ్, జలమండలి జనరల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి తదితరులు

డ్రైనేజీ వ్యవస్థపై జోనల్ కమిషనర్ సమీక్ష

శేరిలింగంపల్లి,జూన్30 ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని డ్రైనేజీవ్యవస్థను పటిష్టంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని,డ్రైనేజీ నెట్‌వర్క్ మ్యాపింగ్,ప్రధాన నాలాలను పరిశీలిస్తున్నట్లు జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కన్సల్టెంట్ ఎన్‌సీపీఈ ప్రతినిధులతో కలిసి జోన్ పరిదిలోని డ్రైనేజీ ప్యాటర్న్,ఫ్లోహైడ్రాలిక్స్‌పై విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా డ్రైనేజీ వ్యవస్థ ప్రస్తుత పనితీరు,డ్రైనేజీ నెట్‌వర్క్ మ్యాపింగ్, జోన్‌లోని ప్రధాన, అనుభంద నాలాల ప్రస్తుత పరిస్థితి, నీటి ప్రవాహ సామర్థ్యంపై ఎస్‌సీపీఈ సమర్పించిన నివేదికలను పరిశీలించారు. వరద ముంపు ప్రాంతాలు, రుతుపవనాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై చర్చించారు. హైడ్రాలిక్ డిజైన్ విషయమై స్రుత డ్రైన్ల కెపాసిటీ, వాటర్ ఫ్లోవేగం, అవరోగాల తొలగింపుపై ఇంజనీరింగ్ విభాగానికి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ పలు సూచనలు చేవారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా స్టార్మ్ వాటర్ డ్రైన్ల అభివృద్ధి,మిస్సింగ్ లింక్‌ల పూర్తిచేయటం కోసం డీపీఆర్ తయారీ వేగవంతం చేయాలని ఎన్‌సీపీఈని ఆదేశించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి జోన్‌లో వేగంగా జరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్తను బలోపేతానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్‌సీపీఈ నివేదిక ఆధారంగా తక్షణ, దీర్ఘకాలిక పనులను గుర్తించి నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని ఆయన అధికారులకు సూచించారు.

డ్రైనేజీవ్యవస్థ పనితీరుపై అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్

మూసీ ప్రక్షాళనకు అందరం సహకరిద్దాం : ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

- మంచిరేవులలో ఇందిరమ్మ చీరెల పంపిణీ

నార్సింగి, జూన్ 30 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "మూసీ ప్రక్షాళన"కు అందరం సహకరిద్దామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం నార్సింగి సర్కిల్ పరిధిలోని మంచిరేవులలో రాష్ట్ర ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, డిసి లక్ష్మారెడ్డిలతో కలిసి "ఇందిరమ్మ చీరల"ను మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ మూసీ ప్రక్షాళన మొదటి దశలో గండిపేట నుంచి బాపూఘాట్ వరకు చేపడుతున్న పనులకు గండిపేట, మంచిరేవుల, నార్సింగి, బైరాగిగూడ, గంధంగూడ, హైదర్షాకోట్ ప్రాంతాల ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అహర్నిశలు రాష్ట్ర అభ్యున్నతి కోసం శ్రమిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి సహకరిస్తే ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని, ఇక్కడి ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మహిళల అభ్యున్నతికి అగ్రపీఠం వేయడం జరిగిందన్నారు. ఏ పథకం చేపట్టినా మహిళలకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రజా పాలనలో ప్రజల అభిష్టానికే అధిక ప్రాధాన్యతను ఇవ్వడం జరుగుతుందని వివరించారు. ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం నార్సింగి డిసి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాల ప్రజలకు 14.వేల ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో చైర్మన్లు మల్లేష్ ముదిరాజ్, వేణుగౌడ్, నాయకులు రామకృష్ణారెడ్డి, ఆర్.నర్సిహ్మా, యం.ప్రవీణ్ యాదవ్, దశరథ్ యాదవ్, ఉషారాణి, పి.రమేష్, శ్రీనివాస్, వినోద్, రాము, మేనేజర్ నాగేంద్రబాబు, అధికారులు స్వాతిరెడ్డి, లక్ష్మీకాంత్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

ఇంటి పనిమనుషులే దొంగలు.. 100 గ్రాముల బంగారు బిస్కెట్ స్వాధీనం

కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 30, ప్రభాతవార్త : కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందు ఫార్చ్యూన్ ఫీల్డ్స్ విల్లాలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు చేదించారు. పనిమనుషులుగా పనిచేస్తున్న ఇద్దరు సోదరీమణులు బంగారు బిస్కెట్‌తో పాటు నగదును అపహరించిన ఘటనలో వారిని అరెస్టు చేసి, వంద గ్రాముల 24 క్యారెట్ల బంగారు బిస్కెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విల్లా నెం.253లో అద్దెకు నివసిస్తున్న ఉద్దగిరి తాతారావు ఇంట్లో కొణాల రమ్య (36), ఆమె సోదరి కర్త నాగలక్ష్మి (34) వంట పనిమనుషులుగా పనిచేస్తున్నారు. ఈ ఏడాది మే 19న ఇంటి యజమాని భార్య నాగ ఉదయ తొందరలో అల్మారాను తెరిచి మూయడం మరిచిపోయారు. దీనిని గమనించిన ఇద్దరు సోదరీమణులు అల్మారాలో ఉన్న 24 క్యారెట్ల వంద గ్రాముల బంగారు బిస్కెట్‌తో పాటు రూ.1 లక్ష నగదును దొంగిలించినట్లు విచారణలో తేలింది. దొంగిలించిన నగదును ఇద్దరూ పంచుకుని వ్యక్తిగత అవసరాలకు ఖర్చు చేయగా, బంగారు బిస్కెట్‌ను ఆనంతరం విక్రయించాలనే ఉద్దేశంతో తమ గదిలో దాచిపెట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం తెల్లవారుజామున పోలీసులు విల్లాలోని వారి గదిపై దాడి చేసి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 24 క్యారెట్ల వంద గ్రాముల బంగారు బిస్కెట్‌ను యధాతథంగా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును కూకట్‌పల్లి డిసిపి పర్యవేక్షణలో, కెపిహెచ్‌బి డివిజన్ ఏసీపీ కెపిహెచ్‌బి ఎక్స్రానిక్ డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ డిఎస్ఐతో పాటు కెపిహెచ్‌బి క్రైమ్ టీమ్ సమన్వయంతో ఛేదించినట్లు పోలీసులు తెలిపారు.

బంగారు బిస్కెట్‌ను ఫిర్యాదుదారులకు అందచేస్తున్న సిఐ రాజశేఖర్ రెడ్డి

కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ రద్దు చేయాలి : నిరుద్యోగ జెఎసి డిమాండ్

తార్నాక, జూన్ 30 ప్రభాతవార్త : కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ, పాలిటెక్నిక్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు జరిగాయని ఆరోపణలు ఉన్న మొత్తం ప్రక్రియను రద్దు చేయాలని ఓయూ జేఏసీ, తెలంగాణ నిరుద్యోగ జేఏసీ డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరాయి.ఈ డిమాండ్లతో మంగళవారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ప్రధాన గ్రంథాలయం నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు ఓయూ జేఏసీ, తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో భారీ నిరుద్యోగుల ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర నాయకులు జార్జిరెడ్డి, ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్. నాగేశ్వరరావు, ఎన్. సుమంత్, కె. స్వాతి మాట్లాడుతూ 2023లో చేపట్టిన కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణలో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపించారు. నకిలీ ధ్రువపత్రాలు, తప్పుడు పత్రాల ఆధారంగా పలువురు క్రమబద్ధీకరణ పొందారని, ఇందులో అధికారుల పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. మొత్తం ప్రక్రియపై నిష్పక్షపాత విచారణ జరిపి, అవసరమైతే క్రమబద్ధీకరణను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కాంట్రాక్ట్ లెక్చరర్లకు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులకు తుది తీర్పు వచ్చే వరకు వేతన పెంపులు మంజూరు చేయరాదని కూడా వారు కోరారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ నిరుద్యోగులకు న్యాయం జరగడం లేదని వారు విమర్శించారు. పోలీసు శాఖలో సుమారు 20 వేల ఖాళీలు ఉన్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ, ప్రభుత్వం కేవలం ఐదు వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వాలని భావించడం నిరుద్యోగుల పట్ల అన్యాయమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని అన్ని ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని, అలాగే ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను కూడా వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.నిరుద్యోగులకు న్యాయం చేయకపోతే, కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణను రద్దు చేయకపోతే రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వం నిరుద్యోగుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్ర మంలో వేదాంత్ మోర్య, రంజిత్ రెడ్డి, విజయ్, చేతన్, బాల కృష్ణ, శ్రీను, నూతన్, రమేష్, అజయ్, మనోహర్, దివ్య, ప్రసన్న, అనురాధ నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఉద్యోగ విరమణల జాతర

చాంద్రాయణగుట్ట, జూన్ 30, ప్రభాతవార్త : పాతబస్తీలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులు మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. ఉద్యోగ జీవితంలో చివరి మజిలి అనుభూతులను కలిసి పంచుకున్నారు. సుధీర్ఘకాలంగా తమతో పనిచేసిన సహచరులు ఇక నుండి బడికి రారని ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. వారి శేష జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో గడవాలని ఆకాంక్షించారు. బహదూర్పురా మండలంలోని దారుల్‌షిఫా ప్రభుత్వ బాలుర అంధుల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల శ్రీనివాస్‌రెడ్డి ఉద్యో

పేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ అండ : శంభీపూర్ కృష్ణ

లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న శంభీపూర్ కృష్ణ

దుండిగల్, జూన్ 30, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ సర్కిల్ శంభీపూర్‌లో మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు చొరవతో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 లక్షల విలువైన ఏడు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ కృష్ణ లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా శంభీపూర్ కృష్ణ మాట్లాడుతూ అనారోగ్యం వంటి అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి గొప్ప భరోసాగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ సహాయాన్ని పొందాలని సూచించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అవసరమైన ప్రతి అర్హత గల కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ అందేలా కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మాదాస్ వెంకటేష్, కొర్ర శంకర్ నాయక్, భరత్ కుమార్, సాయి యాదవ్, వార్డ్ అధ్యక్షుడు బి.నవీన్, నాయకులు ఉస్మాన్, శ్రీశైలం యాదవ్, కిషన్, ప్రభాకర్, స్థానిక నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

సర్ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ల విడుదల

వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

నిజాంపేట్, జూన్ 30, ప్రభాతవార్త

సీపీఐ ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం నిజాంపేటలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభింటెల శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రతి ఇరవై సంవత్సరాలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమమే సర్ అని తెలిపారు.అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓట్ల ఏరివేత పేరుతో ఓటర్ల హక్కులను దెబ్బతీసే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.సర్ కార్యక్రమంపై ప్రజలకు సరైన అవగాహన కల్పించడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని శ్రీనివాస్ విమర్శించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి దరఖాస్తు ఫారాలు పంపిణీ చేస్తున్నప్పటికీ, కార్యక్రమం ఉద్దేశం, విధానం గురించి ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించడం లేదన్నారు. దీంతో చాలా మందికి సర్‌పై స్పష్టమైన అవగాహన లేకపోయిందని పేర్కొన్నారు.ప్రజలకు సరైన సమాచారం చేరేలా ప్రభుత్వం విస్తృత ప్రచారం నిర్వహించాలని, ప్రతి ఓటరు తన వివరాలను సరిచూసుకుని అవసరమైన పత్రాలను సమర్పించి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో పొన్నకంటి దస్తగిరి, నర్సమ్మ, అమృత, నాగమణి, ముత్యాలు, సత్తమ్మ, లక్ష్మి, అమృత తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఓటు హక్కే మూల స్తంభం

బిఎల్ఓలతో కలిసి 'సర్' సమగ్ర సవరణ కార్యక్రమంలో పాల్గొన్న ఏ.జ్యోతి లక్పతి యాదగిరిగౌడ్

హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త

ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు మూల స్తంభం అని, 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు విధిగా ఓటును నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, నల్లకుంట డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ ఏ.జ్యోతి లక్పతి యాదగిరిగౌడ్ సూచించారు. మంగళవారం అంబర్‌పేట నియోజకవర్గం తిలక్‌నగర్ డివిజన్‌లో బిఎల్ఓలతో కలిసి ఇంటింటికి తిరిగి (సర్) ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జ్యోతి లక్పతి యాదగిరిగౌడ్ మాట్లాడుతూ స్పెషల్ ఇన్టెంటివ్ రీవిజన్ పట్ల ఓటర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఏ మాత్రం నిరక్ష్యం వహించిన ఓటు గల్లంతయ్యి ప్రమాదం ఉందని తెలిపారు.డివిజన్ పరిధిలోని ఓటర్లందరూ ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పుట్‌పాత్ ఆక్రమణలు తొలగింపు

ఆక్రమణలను తొలగిస్తున్న జెసిబి

అల్వాల్, జూన్ 30 ప్రభాతవార్త: ట్రాఫిక్ పోలీసుల రోప్ ఆపరేషన్‌లో బాగంగా ఫుట్‌పాత్ ఆక్రమణలను మంగళవారం పెద్ద సంఖ్యలో తొలగించడం జరిగింది. అల్వాల్ కానాజీగూడ డెయిరీ ఫామ్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురైన నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు, జిహెచ్ఎంసి సంయుక్తంగా చర్యలు చేపట్టాయి. తిరిమలగిరి జోన్ ట్రాఫిక్ ఎసిపి శంకర్ రాజు, అల్వాల్ సర్కిల్ డిసి భోగేశ్వర్ పర్యవేక్షణలో ఆపరేషన్ కొనసాగింది. పాదచారులు, వాహనదారులకు అడ్డంకిగా ఫుట్‌పాత్ ఆక్రమణలు ఉన్నాయని ఎసిపి శంకర్ రాజు తెలిపారు.ఫుట్‌పాత్‌లు, రహదారులను ఆక్రమిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హరిలాల్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ ఇతరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లోని వాలంతరీలో 32 సంవత్సరాల పాటు సేవలందించిన ఉమెన్ మజ్దూర్ ఉద్యోగినిలైన రాణి,యశోదల పదవీ విరమణ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వాలంతరీ డిజి అనితతో పాటు అధికారులు,తోటి సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొని సన్మానించి వీడ్కోలు పలికారు

రైతుకు అండగా నిలిస్తేనే దేశం సస్యశ్యామలం : శిల్పవల్లి

నాంపల్లి, జూన్ 30 ప్రభాతవార్త : ప్రజలు, ప్రభుత్వాలు రైతులకు అండగా నిలిస్తేనే దేశం సస్యశ్యామలమై ప్రతీఒక్కరికి కూడు గుడ్డ దొరుకుతుందని ఐపిఎస్ అధికారి శిల్పవల్లి అన్నారు. గ్రామీణాభివృద్ధి, రైతుసంక్షేమం, యువత సాధికారత తదితర అంశాల్లో విశేషసేవలందిస్తున్న నవనిర్మాణ్ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్‌ను ప్రముఖులు ప్రశంసించారు. ట్రస్టు ఆరవ వార్షికోత్సవం, ఏరువాక పౌర్ణమి శుభసందర్భంగా సంస్థ వ్యవసాయ రంగంలో అద్భుత సేవలు అందిస్తున్న రైతులు, ఆగ్రి పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు, వ్యవసాయరంగ నిపుణులకు ఏరువాక అగ్రి ఎక్సలెన్సీ అవార్డుల ప్రదానోత్సవం నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో కన్నులపండువగా జరిగింది. ఆ సందర్భంగా ముఖ్యఅతిథి శిల్పవల్లి విశిష్ట అతిథులు ప్రముఖ సినీనటుడు, రాజకీయనాయకుడు బాబుమోహన్, డి.చక్రపాణి, డా. రామ్‌శెట్టి శివశంకర్, ఈశ్వర్, నిర్వాహకులు రాంబాబు, సాయిజ్యోతి, జగదీశ్వరరావు తదితరులతో కలిసి వ్యవసాయరంగానికి విశిష్ట సేవలు అందించిన డా. రాజారెడ్డికి జీవనసాఫల్య పురస్కారంతో, వివిధ విభాగాలకు చెందిన 60మంది ప్రముఖులను ఏరువాక అగ్రి ఎక్సలెన్స అవార్డులు 2026తో ఘనంగా సత్కరించారు. అనంతరం నేటి అత్యాధుని సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తూ ప్రకృతి వైపరీత్యాలు, పంటనష్టాలు, అప్పుల భారంతో ఇబ్బందులుపడే రైతులకు సమయానుకూల సహాయం, సంక్షేమం తదితర రైతులకు ఉపయోగపడేలా రైతు కుటుంబానికి చెందిన బిటెక్ విద్యార్థులు సిద్ధార్థ, కార్తీక్‌లు రూపొందించిన రైతురక్ష వెబ్‌సైట్‌ను, లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఫణీంద్ర, మోహన్, తేజస్విని అజయ్, శృతి తదితరులు, ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన రైతులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫీజుల బకాయిలను వెంటనే చెల్లించాలి :ఎంపి ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్,జూన్ 30,ప్రభాతవార్త: పెండింగ్‌లో ఉన్న ఫీజుల బకాయిలను వెంటనే చెల్లించాలని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి. ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం బి.సి విద్యార్థి సంఘం అధ్యక్షులు పగిళ్ళ సతీష్, రాష్ట్ర బి.సి యుజన సంఘం అధ్యక్షులు జిల్లపల్లి అంజి నాయకత్వంలో హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ 14 లక్షల మంది బిసి, ఎస్సి,ఎస్టీ విద్యార్థుల ఫీజుల బకాయిలు స్కాలర్ షిప్ లు 8 వేల కోట్లు వెంటనే చెల్లించాలని, కొత్తగా ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9 వెంటనే రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్దించాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు.దాదాపు 8 వేల కోట్ల ఫీజుల బకాయిలు ఉంటే ప్రభుత్వం మొక్కుబడిగా 100 కోట్లు విడుదల చేయడానికి ప్రస్తావిస్తూ 8వేల కోట్ల బకాయిలు ఉంటే 100 కోట్లు ఏ ములకు సరిపోతాయని ప్రశ్నించారు.కొత్త విధానం జీవో నెంబర్ 9 ఆచరణలో అమలులో సాధ్యం కాదని ఏ కాలేజీ కూడా ఒప్పుకోదన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా తెచ్చుకున్న... ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేయొద్దని... విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గత 18 ఏళ్లుగా కొనసాగుతున్న పథకాన్ని తూట్లు పొడచొద్దని

హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ధర్నాచేస్తున్న ఎంపి.ఆర్.కృష్ణయ్య, పగిళ్ల సతీష్, జిల్లపల్లి అంజి, నీల వెంకటేష్ తదితరులు

ఉమ్మడిఏపీ రాష్ట్రంలో నుంచి కొనసాగుతున్న ఈపథకాన్ని ,తెలంగాణ రాష్ట్రంలో కొనసాగించేందుకు ఎందుకు అభ్యంతరం అని ప్రశ్నించారు.ముఖ్యమంత్రి తన పద్ధతిని మార్చుకొని విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం మోపే విధానాలను ఉపసంహరించుకోవాలని కృష్ణయ్య కోరారు. ఈ ముట్టడి కార్యక్రమంలో బి.సి కులాల ఐఖ్యవేదిక అధ్యక్షులు జి. అనంతయ్య,బి.సి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, రాజేందర్, సిద్దు యాదవ్, బి.సి విద్యార్థి సంఘం నాయకులూ శివ యాదవ్, మొగిలి కృష్ణ, నిఖిల్ పటేల్, అంజి గౌడ్, శ్రీనివాస్ చారి, భీమ రాజు నరేష్ గౌడ్ తదితరులు పెద్ద ఎత్తున్న విద్యార్థులు పాల్గొన్నారు

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రజాస్వామ్య బలోపేతానికి దోహదం : ముద్దారపు శ్రీకాంత్ గౌడ్

ఓటరు జాబితా పరిశీలన, సవరణ కార్యక్రమాలను పరిశీలిస్తున్న శ్రీకాంత్ గౌడ్

సంజీవరెడ్డి నగర్, జూన్ 30, ప్రభాతవార్త: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా అమీర్‌పేట్ డివిజన్‌లోని 133 నుంచి 142 వరకు ఉన్న పలు పోలింగ్ బూత్‌లలో ఓటరు జాబితా పరిశీలన, సవరణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోటా నీలిమ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు డీసీసీ జనరల్ సెక్రటరీ ముద్దారపు శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా బీఎల్‌వో శ్రీనివాస్‌తో కలిసి బూత్‌లను సందర్శించిన శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ద్వారా ఓటరు జాబితా మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ ముద్దారపు శ్రీకాంత్ గౌడ్, బీఎల్‌వో శ్రీనివాస్, అమీర్‌పేట్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు రాజరాజేశ్వరి, కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు వెంకటేష్, దయాకర్ పాల్గొన్నారు.

ఆపరేషన్ రోప్‌తో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు..

సంజీవరెడ్డి నగర్, జూన్ 30, ప్రభాతవార్త: నగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించేందుకు ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం ప్రత్యేకంగా ఆపరేషన్ రోప్ నిర్వహించారు. ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ ఏసీపీ కె. హరి ప్రసాద్ పర్యవేక్షణలో, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె. మహేష్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. అమీర్‌పేట్‌లోని ఏఏఏ సినిమాస్ సర్కిల్ నుంచి బల్కంపేట ఎల్లమ్మ తల్లి ఆలయం మీదుగా ఫతేనగర్ ఫ్లైఓవర్ వరకు ఉన్న ఫుట్‌పాత్‌లు, రహదారులపై ట్రాఫిక్‌కు ఆటంకంగా మారిన ఆక్రమణలను ట్రాఫిక్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె. మహేష్ మాట్లాడుతూ పాదచారులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన మార్గాన్ని కల్పించడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడమే ఆపరేషన్ రోప్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొని ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌ను సజావుగా కొనసాగించే చర్యలు చేపట్టారు.

మాస్టర్‌ప్లాన్ ఛీఫ్ ఇంజనీర్ కామేష్ పదవీవిరమణ

- సన్మానించిన రైతుడిస్కం సిఎండి ముషారఫ్ ఫరూఖీ

కామేష్‌దంపతులను సన్మానిస్తున్న సిఎండీ ముషారఫ్ ఫరూఖీ

హైదరాబాద్, జూన్ 30,ప్రభాతవార్త: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టిజిఎస్‌పిడిసిఎల్) చీఫ్ ఇంజనీర్ (మాస్టర్ ప్లాన్) అట్లూరి కామేష్ పదవీ విరమణ చేశారు. ఈమేరకు మంగళవారం మింట్‌కాంపౌండ్ కార్పొరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి రైతు డిస్కం సీఎండీ, రెడ్‌కో వైస్ చైర్మన్ ముషారఫ్ ఫరూఖీ హాజరై కామేష్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ముషారఫ్ ఫరూఖీ మాట్లాడుతూ,కామేష్ సూపరింటెండింగ్ ఇంజనీర్ , చీఫ్ ఇంజనీర్ హోదాల్లో సేవలందించారని తెలిపారు. కాగా కామేష్ రెండునెలలపాటు రైతుడిస్కంలోనూ పనిచేశారని అలాగే సంస్థ అభివృద్ధికి, వినియోగదారులకు మెరుగైన సత్వర విద్యుత్ సేవలు అందించేందుకు ఆయన ఎంతో అంకితభావంతో, నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు.ఈ వీడ్కోలు కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్లు పి. ఆనంద్, శ్రవణ్ కుమార్, సీజీఎం సుధా మాధురి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో బాధ్యతలు నిర్వహిస్తే ప్రజల మనసులో స్థానం : చీరె సత్యనారాయణ

పదవీ విరమణ పొందిన లతను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు చీరె సత్యనారాయణ.

బేగంపేట జూన్ 30,ప్రభాతవార్త

అంకిత భావం,క్రమశిక్షణతో బాధ్యతలు నిర్వహిస్తే ప్రజల మనసులో స్థానం సంపాదించుకుంటారని బీజేపీ సీనియర్ నాయకులు చీరె సత్యనారాయణ అన్నారు.మంగళవారం రాంగోపాల్‌పేట డివిజన్ చుట్టల బస్తీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో సూపరింటెండెంట్ గా సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించిన లత పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ ఆత్మీయ వీడ్కోలు సభలో చీరె సత్యనారాయణ(శ్రీకాంత్) పాల్గొని ఆమెను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లత తన సర్వీసులో ఎంతో అంకిత భావంతో విధులు నిర్వర్తించారని,ఈ ప్రాంత ప్రజల మనసులో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు.రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఆమె చేసిన నిస్వార్థమైన సేవలు ఎల్లప్పుడూ ఈ ప్రాంత ప్రజలు గుర్తుంచుకుంటారని ప్రశంసించారు.అనంతరం తోటి సిబ్బంది ,స్థానికులు ఆమెకు శాలువాలు కప్పి సత్కరించి ఆమెపై తమకున్న అభిమానాన్ని వ్యక్తం చేసారు.ఆత్మీయ వీడ్కోలు పలికారు.

అర్థశాస్త్ర అధర్వణవేదంలో చరిత్ర సృష్టించిన భారతీయుడు ఆర్యచాణక్య : డా. కె.వి.రమణాచారి

ఆర్యచాణక్య చారిత్రిక నాటకంలో ఒక దృశ్యం

రవీంద్రభారతి, జూన్ 30 ప్రభాతవార్త : క్రీస్తుపూర్వం 375 నుండి 283 వరకు జీవించిన మేధావి, తక్షశిల విశ్వవిద్యాలయంలో అధర్వణ వేద అధ్యాపకుడిగా, అర్థశాస్త్ర రచయితగా విశ్వవ్యాప్తంగా చరిత్ర సృష్టించిన భారతీయ మేధావి ఆర్యచాణక్య అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, ఐఎఎస్ విశ్రాంత అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. రసరంజని ప్రతీనెలా ప్రదర్శిస్తున్న నాటకాల క్రమంలో సోమవారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో రసరంజని ఆధ్వర్యంలో మహతి కళావిపంచి హైదరాబాద్ వారి నిర్వహణలో కంచర్ల సూర్యప్రకాశరావు రచన, ఉప్పలూరి సుబ్బరాయశర్మ దర్శకత్వంలో రూపొందిన ఆర్య చాణక్య చారిత్రాత్మక నాటకం అద్భుతంగా ప్రదర్శించబడి ప్రశంసలందుకుంది. ప్రధానపాత్రల్లో చాణక్యుడుగా చంద్రశేఖర్, చంద్రగుప్తుడుగా సంజీవ్ ఆచార్య, పర్వతకుడుగా గంజి సత్యనారాయణ, వైభ్రుడుగా బొప్పన నరసింహారావు, రాక్షసమంత్రిగా లంక లక్ష్మీనారాయణ, మురాదేవిగా గంజి శోభ, విషకన్యగా ప్రియాంక, ఇందుశర్మగా భాగి శివశంకరశాస్త్రి మొత్తం 22మంది నటీనటులు ఆయా పాత్రల్లో సహజసిద్ధంగా నటించి ప్రశంసలు అందుకున్నారు.

సర్‌ను పర్యవేక్షించిన రాజకీయ పార్టీలు

అల్వాల్, జూన్ 30 ప్రభాతవార్త: సర్ ప్రక్రియపై రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. అర్హులైన ఓటర్లను కాపాడుకునేందుకు బిఎల్ఓలు ఇతర సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళుతున్నారు. మాజీ కార్పొరేటర్లు నుంచి బూత్ స్థాయి కార్యకర్త వరకు శ్రమిస్తున్నారు. సర్‌లో బాగంగా ప్రభుత్వ సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేకు వారు సహకరిస్తున్నారు. ధరఖాస్తులు నింపడంపై అవగాహన లేని వారు అధిక సంఖ్యలో ఉంటున్నారు. ఇటువంటి వారికి స్వయంగా దగ్గర ఉండి వారి వివరాలుతో పాటుగా ప్రభుత్వ సిబ్బందికి ఇవ్వాల్సిన పత్రాలను అందిస్తున్నారు. అల్వాల్ డివిజన్‌లో ఎంబటి మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డిలు సర్‌లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ జితేందర్‌నాథ్ సైతం నాయకులుతో కలిసి సర్‌లో పాల్గొంటున్నారు.

మూడు రాష్ట్రాల మోస్ట్ వాంటెడ్ దొంగ బ్రూస్ లీ గ్యాంగ్ ఆటకట్టు

సికింద్రాబాద్, జూన్ 30 ప్రభాతవార్త: నగరంలో వరుస దోపిడీలు, ఆస్తి నేరాలకు పాల్పడుతూ ప్రజలను హడలెత్తిస్తున్న అంతర్రాష్ట్ర మోస్ట్ వాంటెడ్ నేరస్థుడు, బ్రూస్ లీ గ్యాంగ్ ఆటకట్టించారు చిలకలగూడ పోలీసులు. ఇందుకు సంబంధించిన వివరాలను చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో జరిపిన మీడియా సమావేశంలో తెలిపారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా ముఠా సూత్రధారితో సహా ముగ్గురు పాత నేరస్థులను అరెస్ట్ చేయగా, చట్టంతో వివాదంలో ఉన్న ఒక బాలుడిని (సిసిఎల్) అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుండి దొంగిలించబడిన రెడ్‌మి మొబైల్ ఫోన్, ఒక యాక్టివా స్కూటర్‌తో పాటు మీర్‌పేట్ దొంగతనానికి సంబంధించిన రూ. 2.25 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ముషీరాబాద్ జవహర్‌నగర్‌కు చెందిన కార్మికుడు సి. రాజ్ కుమార్ ఈ నెల 22న సాయంత్రం బోయిగూడలోని ఫ్లోరా హోటల్ వద్ద భోజనం కొనుగోలు చేస్తుండగా, హోండా యాక్టివాపై వచ్చిన నలుగురు దుండగులు అతడిని అడ్డుకున్నారు. బాధితుడిని బలవంతంగా పద్మారావునగర్ వైపు తీసుకెళ్లి తీవ్రంగా కొట్టి, అతని వద్దనున్న రెడ్‌మి ఎ2ఎక్స్ మొబైల్ ఫోన్, రూ. 6వేల నగదును లాక్కున్నారు. అనంతరం ఆలగడ్డ బావి రైల్వే అండర్ బ్రిడ్జ్ సమీపంలో వదిలిపెట్టి, చిలకలగూడ

క్రాస్ రోడ్స్ వద్ద బాధితుడిని మరోసారి బెదిరించి పరారయ్యారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన చిలకలగూడ క్రైమ్ టీమ్ సికింద్రాబాద్ జోన్ డీసీపీ శ్రీమతి రక్షిత కృష్ణమూర్తి, ఆదేశాల మేరకు రంగంలోకి దిగింది. సాంకేతిక విశ్లేషణ, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను అరెస్ట్ చేశారు. కాగా ఈ ముఠా కదలికలను పోలీసులు వివరించారు. ఈ ముఠాకు ప్రధాన సూత్రధారి కర్ణాటక హుబ్బళ్ళికి చెందిన దార్ల నెహెమ్యా బ్రూస్ లీ (30)గా గుర్తించారు. ఇతనిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో హత్య, హత్యాయత్నం, ఇళ్ల దొంగతనాలు సహా ఏకంగా 65 క్రిమినల్ కేసులు ఉన్నాయి.అరెస్ట్ అయిన వారిలో ప్రధాన సూత్రధారి బ్రూస్ లీతో పాటు, అతనికి సహకరించిన దారా అశ్వంత్ (27), రసూల్‌పురాకు చెందిన పాత నేరస్థుడు నితిన్ ఫ్రాన్సిస్ బబ్లూ (22) ఉన్నారు.

జల్సాలకు అలవాటుపడ్డి బైక్ దొంగతనాలు..

- ఇద్దరు యువకులు అరెస్ట్ -5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

అత్తాపూర్ జూన్ 30 ,ప్రభాతవార్త : విలాసవంతమైన జీవితం గడిపేందుకు జల్సాలకు అలవాటుపడ్డి బైక్ చోరీలకు పాల్పడుతున్న యువకులను అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. సిఐ నాగేశ్వర్ రావు వివరాల ప్రకారం...ఈనెల 25న నరసింహ అనే వ్యక్తి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ (టిఎస్ 07కెబి4061)ను శివరాంపల్లి పిల్లర్ నెంబర్ 295వద్ద ఉన్న ఓ రెస్టారెంట్ ముందు పార్క్ చేసి పనిమీద బయటకువెళ్లాడు.ఇది గమనించిన ఎ4 నిందితుడు మీగతా వారికి సమాచారం అందించాడు.వారు అక్కిడికి చేరుకున్నారు.అనంతరం నిందితులు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ లాక్ విరగొట్టి చోరి చేసి ఎత్తుకెళ్లారు.బాధితుడు అత్తాపూర్ పోలీసులకు ఫీర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం చోరికి పాల్పడిన ఇద్దరు పాత నేరస్థులైన నిందితులు మహమ్మద్ షానవాజ్ (18) మహమ్మద్ మోయిజ్ మోహియుద్దీన్ (18)లను అత్తాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఎ3 నూర్,ఎ4 ఫర్హాన్ పరారిలో ఉన్నారు. నిందితుల వద్ద నుంచి మొత్తం 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకు

న్నారు. వీటిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ హిమాలయన్ బైక్, రెండు సుజుకి బర్గ్‌మన్ స్ట్రీట్ స్కూటర్లు, రెండు హోండా యాక్టివా వాహనాలు ఉన్నాయి. వీటిలో రెండు వాహనాలు బేగంబజార్ మరియు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన వాహన దొంగతనాల కేసులకు సంబంధించినవిగా గుర్తించారు.దర్యాప్తులో నిందితులు విలాసవంతమైన జీవితం, చెడు వ్యసనాల కోసం సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు సిఐ తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రూ.10.80 కోట్లతో బోయిన్‌పల్లి మార్కెట్ అభివృద్ధి : చైర్మన్ ఆనంద్ బాబు

బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ సమావేశంలో చైర్మన్ ఆనంద్ బాబు,కార్యదర్శి వెంకటేష్,వైస్ చైర్మన్ దేవుడు,సభ్యులు

కంటోన్మెంట్,జూన్ 30 ప్రభావార్త: దేశంలో అతి పెద్ద మార్కెట

బాబానగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులకు శ్రీకారం

పనులను పరిశీలిస్తున్న సాయిజన్ శేఖర్

నాచారం, జూన్ 30 ప్రభాతవార్త : నాచారం బాబానగర్ మెయిన్ రోడ్డులో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు మంగళవారం ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే బిఎల్ఆర్ సహకారంతో నిధులు మంజూరవడంతో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. బాబానగర్ మెయిన్ రోడ్డులో భూగర్భ డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో ఆ ప్రాంతంలోని పలువురు తమ ఇళ్ల నుంచి వచ్చే మురుగునీటిని ఓపెన్ నాలాలోకి మళ్లించాల్సి వచ్చేది. కాలక్రమేణా నాలా పూర్తిగా పూడికతో నిండిపోవడంతో డ్రైనేజీ నీరు నిలిచిపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానికుల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన చొరవతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరయ్యాయి. దీంతో ప్రస్తుతం పనులు వేగంగా కొనసాగుతున్నాయి. జరుగుతున్న పనులను మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, మేడల మల్లికార్జున్ గౌడ్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతగా బాబానగర్ వాసులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కట్ట బుచ్చన్న గౌడ్, హరి ప్రసాద్, ఒబేద్, అబ్దుల్ అజీజ్‌తో పాటు పలువురు స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు అందజేయాలి : కూరెళ్ళ మహేష్ కుమార్

సమావేశంలో ప్రసంగిస్తున్న తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాప వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ళ మహేష్ కుమార్ తదితరులు

మలక్ పేట, జూన్ 30, ప్రభాతవార్త: రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు స్కాలర్ షిప్ లు ఫీజు రీయింబర్స్ మెంట్లు అందజేయాలని తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాప వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ళ మహేష్ కుమార్ పేర్కొన్నారు. మలక్ పేటలోనీ తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ళ మహేష్ కుమార్ మాట్లాడుతూ సుమారు రూ.8వేల కోట్ల పైగా బడ్జెట్ ను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు స్కాలర్ షిప్ లు రియింబర్స్ మెంట్స్, మెస్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పనిచేసే ఔట్ సోర్సింగ్ వర్కర్స్ కు వెంటనే జీతాలు చెల్లించాలని అదేవిధంగా హాస్టల్ భవనాల అద్దెలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ తరపున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నమని, లేనిపక్షంలో రానున్న పక్షం రోజుల్లో పెద్ద ఎత్తున సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ యొక్క కార్యక్రమంలో వ్యవస్థాపక రాష్ట్ర కోఆర్డినేటర్ కొట్ర ప్రభాకర్ రెడ్డి, నిమ్మల లెనిన్ అరుణ్ కుమార్, వెంకటేష్ ,గోపి, నాని, రైతులు, విద్యార్థి నాయకులు, విద్యార్థి సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల సేవలు ఎంతో విలువైనవి



ఇందిరని సత్కరిస్తున్న సుఖ్నేదర్ రెడ్డి.

హయత్ నగర్, జూన్ 30 ప్రభాతవార్త : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని... విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడానికి వారు చేస్తున్న కృషి అభినందనీయమని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖ్నేదర్ రెడ్డి అన్నారు. హయత్ నగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందిన పి.ఇందిర అభినందన సభలో అయన పాల్గొని శాలువా, పుష్ప గుచ్చంతో సత్కారించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్తులో సమాజ సేవలో చురుకైన పాత్ర పోషించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రోడ్డు డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, తెలంగాణ డెయిరీ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్, నల్లగొండ జిల్లా విద్యశాఖ అధికారి సుశీంద్ర రావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోరుగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ

మల్కాజిగిరి జూన్ 30 ప్రభాతవార్త : ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభమై జోరుగా సాగుతోందని మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఎన్యూమరేటర్లు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మంగళవారం మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్ నగర్ డివిజన్ హనుమాన్ పేట లోని సీనియర్ సిటిజన్ ఏ. వీ స్వామి నివాసం వద్ద ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం జరిగింది. ప్రజలు అందించే ఎన్యూమరేషన్ పత్రాలను పూర్తిగా నింపి ఒక ప్రతిని బీఎల్ఓలకు తిరిగి అందజేయాలని, మరో ప్రతిని తమ వద్ద భద్రపరుచుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా ప్రతి ఓటరు ఈ ప్రక్రియలో సహకరించాలని కోరారు. అలాగే, జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తామని సంచిత్ గంగ్వార్ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల ఆగ్రహం

కళాశాలల బహిష్కరణకు విశేష స్పందన.. కొత్తపేట చౌరస్తాలో రాస్తారోకో ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం : గుజ్జ సత్యం

ప్రదర్శనలో పాల్గొన్న గుడ్ జాబ్ సత్యం, నీల వెంకటేష్ తదితరులు

ఎల్.బి.నగర్, జూన్ 30 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రవ్యాప్త కళాశాలల బహిష్కరణ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం పేర్కొన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు గుజ్జ సత్యం అధ్యక్షతన మంగళవారం కొత్తపేటలో నిర్వహించిన ఆందోళనలో వందలాది మంది విద్యార్థులు పాల్గొని ప్రభుత్వ వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ కొత్తపేట చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గుజ్జ సత్యం మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ అనేది ప్రభుత్వ దయాదాక్షిణ్యం కాదని, రాజ్యాంగబద్ధమైన విద్యా అవకాశాలను కల్పించే సామాజిక న్యాయ పథకం అన్నారు. వేలాది మంది పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థుల భవిష్యత్తు ఈ పథకంపై ఆధారపడి ఉందని, ప్రభుత్వం నిధుల విడుదలలో నిరక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఇప్పటికే కళాశాలలకు వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోవడంతో అనేక విద్యాసంస్థలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయని, మరోవైపు విద్యార్థులు ఫీజుల పేరుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను హక్కుగా గుర్తించిన ప్రభుత్వం, అదే హక్కు అమలులో మాత్రం వెనుకడుగు వేస్తుందన్నారు. విద్యార్థుల సహనాన్ని ప్రభుత్వం పరీక్షించవద్దని, సమస్యను రాజకీయ కోణంలో కాకుండా విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పరిష్కరించాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని యథాతథంగా కొనసాగించడం, పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయడం, విద్యార్థులపై ఆర్థిక భారం మోపే విధానాలను ఉపసంహరించుకునే వరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్, బీసీ కులాల సమన్వయ వేదిక బొమ్మ రఘురాం నేత, సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ సల్వా చారి, అశోక్ గంగపుత్ర , మహేష్ , రాజేష్, నరేందర్, విద్యార్థి నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పెండింగ్ పనులు మంజూరు చేయాలని ఎంఎంసి కమిషనర్‌కు వినతి

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, గంధం నాగేశ్వర్‌రావు తదితరులు

రామంతాపూర్, జూన్ 29 ప్రభాతవార్త : రామంతాపూర్ డివిజన్ రూ.12 కోట్ల 37లక్షల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కోరుతూ మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నేత గంధం నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పలువురు నేతలు ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పెండింగ్ పనుల వివరాలను ఆయనకు అందజేశారు. రామంతాపూర్ గోఖలేనగర్ రూ. 60 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, నెహ్రూనగర్‌లో రూ.60 లక్షల వ్యయంతో బాక్స్ డ్రైన్, గాంధీ నగర్ రూ.60 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్, ఇంద్రానగర్ రూ.40 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్, ఆర్టీసి కాలనీ రూ.45లక్షల వ్యయం తో కమ్యూనిటీ హాల్ రెండో అంతస్థు, ఆర్టీసి కాలనీ రూ.45లక్షల వ్యయం తో సీసీ రోడ్డు, ఆర్టీసి కాలనీ రూ 35లక్షల వ్యయం తో సిసి రోడ్డు, గణేష్ నగర్‌లో కొత్త కమ్యూనిటీ హాల్. రూ.60 లక్షల వ్యయంతో శ్రీనగర్ కాలనీ జీడీ బేకరీ జంక్షన్ దగ్గర సిసి రోడ్డు, ఒక కోటి వ్యయంతో రాజేంద్రనగర్ నేతాజీ నగర్ గ్రేవీయార్డ్, రూ.72 లక్షలతో శాంతినగర్ బాక్స్ డ్రైన్, రూ.2 కోట్ల వ్యయంతో మధురా నగర్ గణేష్ నగర్ బాక్స్ డ్రైన్, రూ. 4 కోట్ల 50లక్షలతో కెసిఆర్ కాలనీలో బాక్స్ డ్రైన్, రూ. 75 లక్షలతో పిఎస్ కాలనీ సెటిల్ కోర్టు, రూ. 10 లక్షల వ్యయం తో ప్రగతి నగర్‌లో కమిటీ హాల్ మొదటి అంతస్తు సీనియర్ సిటిజన్ల కోసం, రూ.45లక్షల వ్యయం తో పనులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

సర్ ప్రక్రియ పారదర్శకంగా సాగేలా చూడాలి : జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్

రామంతాపూర్‌లో ఓటరు ఫారం పంపిణీ చేస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, పరమేశ్వర్‌రెడ్డి, ఎం.డి.రఫీక్ తదితరులు

రామంతాపూర్, జూన్ 29 ప్రభాతవార్త : భారత ఎన్నికల సంఘం చేపట్టిన సర్ సాఫీగా సాగేలా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తదితరులతో కలిసి రామంతపూర్ డివిజన్ ఇందిరానగర్ కాలనీలో పర్యటించి క్షేత్ర స్థాయిలో సర్ ప్రక్రియ తీరును పరిశీలించారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులను (బీఎల్ఓలు) కలిసి సర్ ప్రక్రియ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిజమైన ప్రతి ఓటరుకు ఈ ప్రక్రియతో అన్యాయం జరుగకుండా చూడాలని , ఎలాంటి లోపాలు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని వారు కోరారు. పజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది సామాన్యుడికి ఉన్న అతిపెద్ద ఆయుధమని, సిఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్‌గౌడ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ శ్రేణులు ఈ ప్రక్రియలో పూర్తి బాధ్యతతో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సర్ ప్రక్రియ ద్వారా అర్హులైన, నిజమైన ఒక్క ఓటరు పేరు కూడా పొరపాటున ఓటర్ల జాబితా నుండి తొలగిపోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఓటర్ల సవరణ లేదా కొత్తగా నమోదు చేసుకునే ప్రక్రియలో సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి సులభంగా అవగాహన కల్పించేలా మన బూత్ లెవల్ ఏజెంట్లు సహాయపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామంతపూర్ డివిజన్ అధ్యక్షులు రఫీక్, పిసిసి సభ్యుడు తౌఫిక్, మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి జలీల్ పాషా, తవిడబోయిన గిరిబాబు, వల్లపు శ్రీకాంత్ యాదవ్, పూస సత్తయ్య, ఆదినారాయణ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, గరిక సుధాకర్, మొగిలి లింగం, బొక్క సురేష్, అంగాల సందీప్, బుల్లెట్ అశోక్, సంధ్యారాణి, గాయత్రి గౌడ్, అంబికా తబస్సుం బేగం, అన్నపూర్ణ పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ నిలిచిన రిజిస్ట్రేషన్ సేవలు

-ప్రజల తప్పని ఇబ్బందులు : బోసిపోయిన కార్యాలయాలు

ప్రజలు లేక బోసిపోయిన ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం దృశ్యం.

ఉప్పల్, జూన్ 29 ప్రభాతవార్త : తెలంగాణవ్యాప్తంగా మంగళవారం రిజిస్ట్రేషన్ సేవలు మళ్లీ నిలిచిపోయాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో గత కొద్ది రోజులుగా సర్వర్ పనిచేయడం లేదు. గత 3 రోజులుగా రిజిస్ట్రేషన్లు ఆపివేసి సర్వర్ పునరుద్ధరించారు. సర్వర్ ఆగిపోగా సోమవారం తిరిగి పునరుద్ధరించారు. అయితే అంతలో మళ్లీ సర్వర్ ఇష్యూ వచ్చింది. దీంతో లక్షలాది ఫైళ్లు పెండింగ్‌లో పడిపోయాయి. ప్రస్తుతం శుభ ముహూర్తాలు ఉండటంతో ఇళ్ల రిజిస్ట్రేషన్ల కోసం చాలామంది వేచి చూస్తున్నారు. కానీ సేవలు నిలిచిపోవడంతో వారంతా అసహనానికి గురవుతున్నారు. నగర శివారులోని పలు ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్‌ల కోసం ప్రజలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వస్తున్నారు. ముందుగానే స్లాట్ బుక్ చేసుకున్న పలువురికి సర్వర్ పనిచేయడం లేదనే సమాచారం రావడంతో వెనుతిరిగి పోతున్నారు. రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రభుత్వానికి రూ. కోట్లతో ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా దీనిపై ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా పెళ్లిల నమోదు, ప్లాట్లు, ఇళ్ల క్రయ విక్రయాల కోసం అధిక శాతం మంది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వస్తుంటారు. పలువురు డాక్యుమెంట్ రైటర్లు కూడా ముందుగానే క్రయ విక్రయదారులకు సమయం ఇచ్చి రావాలని సూచిస్తున్నారు. తీరా కార్యాలయానికి వచ్చిన తర్వాత సర్వర్ పనిచేయడం లేదని చెప్పడంతో వెనుతిరిగి పోతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనాల చోరీ కేసుల్లో పాత నేరస్థుడి అరెస్ట్

-రూ.4 లక్షల విలువైన 7 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్న పాత నేరస్థుడిని అరెస్టు చేసి ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న మలక్ పేట ఇన్ స్పెక్టర్ కుంభం నరసింహ, డిఐ ధర్మారెడ్డి గిరి తదితరులు

మలక్ పేట, జూన్ 30, ప్రభాతవార్త: విలాసవంతమైన జీవనశైలికి అలవాటు పడి డబ్బు సమకూర్చుకోవడం కోసం ద్విచక్ర వాహనాలను దొంగతనం చేస్తున్న పాత నేరస్తుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి సుమారు రూ. నాలుగు లక్షల విలువగల 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న సంఘటన మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మలక్ పేట పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్ స్పెక్టర్ కుంభం నరసింహ వివరాలను వెల్లడించారు. హస్తినాపురం కు చెందిబండ్రవల్లి రాకేష్ అలియాస్ రాఖీ అలియాస్ లడ్డూ (23). ఇతను డిగ్రీ విద్యార్థి. కాగా నిందితుడిపై గతంలో 18 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. జైలు నుంచి విడుదలైన అనంతరం కూడా తన నేరప్రవర్తనను మార్చుకోకుండా, డూప్లికేట్ తాళాల సహాయంతో కేవలం 30 రోజుల వ్యవధిలో 7 ద్విచక్ర వాహనాలను దొంగిలించాడు. దొంగిలించిన వాహనాలను హస్తినాపురం, సహారా ఎస్టేట్స్, పసుమాముల ప్రాంతాల్లో తన సహచరుల వద్ద దాచిపెట్టి, అనంతరం విక్రయించేందుకు ప్రయత్నించేవాడు. తన చెడు అలవాట్లు మరియు విలాసవంతమైన జీవనశైలికి డబ్బు సమకూర్చుకోవడం కోసం నేరాలకు పాల్పడు తుండేవాడు. మలక్‌పేట్, చైతన్యపురి, వనస్థలిపురం, సరూర్ నగర్, నాగోల్ మరియు లాలాగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 7 ద్విచక్ర వాహనాలను దొంగలించాడు. ఈ మేరకు మలక్‌పేట్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ మేరకు మలక్‌పేట్ ఎసిపి ఎల్. రాజా వెంకట్ రెడ్డి పర్యవేక్షణలో, మలక్‌పేట్ ఇన్‌స్పెక్టర్ కుంభం నరసింహ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ధర్మారెడ్డి గిరి లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి

రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

హయత్ నగర్, జూన్ 30 ప్రభాతవార్త : లెక్చరర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీరోడ్ నెంబర్ 2, 3 లలో తరచూ డ్రైనేజీ మురుగునీరు పొంగిపొర్లుతూ ఇళ్లలోకి చేరుతుండడంతో కాలనీ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మురు గునీటితో పరిసరాలు దుర్గంద భరింతంగా మారి దోమలు వృద్ధి చెంది ప్రజలు డెంగ్యూ, మలేరియా వంటి అంటు వ్యాధుల బారిన పడు తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు అనారోగ్యం పాలవు తున్నారు. కొత్త డ్రైనేజీ లైన్ మంజూరు చేయాలని పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారులకు విన్నవించినా పట్టించు కోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తక్షణమే కాలనీకి కొత్త డ్రైనేజీ లైన్ మంజూరు చేసి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతు న్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే పూల్ సింగ్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నేతలు

ఉప్పల్, జూన్ 29 ప్రభాతవార్త : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఉప్పల్ తహసీల్దార్ పుల్ సింగ్ చౌహాన్‌కు మేడ్చల్ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జె. వెంకన్న మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు స్కీములను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వద్దని కోరారు. సిఎస్ హెల్త్ టెస్టులను వెంటనే రద్దు చేయాలని, సహజ మరణానికి రూ.ఐదు లక్షలు పెంచాలని కోరారు. పెండింగ్ క్లెయిమ్‌లు వెంటనే నిధులు మంజూరు చేయాలని, ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన జీవో 12 రద్దుచేసి ప్రభుత్వమే హెల్పేర్ బోర్డు ద్వారా కార్మిక సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. 60 ఏళ్ళు నిండిన కార్మికులకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని, అర్హులైన భవనిర్మాణ కార్మికులకు డబల్ బెడ్ రూమ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక నాయకులు సిహెచ్ జంగయ్య, లాలు, కృష్ణ,నరసింహ, రంగనాయకులు, వెంకటేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్ సదన్ డివిజన్‌లో 'సర్' ప్రారంభం

మాజీ కార్పొరేటర్ సామ స్వప్నకు సర్ దరఖాస్తు ఫామ్ అందజేస్తున్న డిసి భాస్కర్‌రెడ్డి

సైదాబాద్, జూన్ 30 ప్రభాతవార్త: ఐఎస్ సదన్ డివిజన్ కేశవనగర్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ సామ స్వప్న సుందర్‌రెడ్డి మంగళవారం డిసి భాస్కర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓలు అశోక్ యాదవ్, ఖుద్రత్ అలీ పాల్గొన్నారు.

లక్ష్మీనగర్‌లో పార్కు ప్రారంభం

పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్

సైదాబాద్, జూన్ 30 ప్రభాతవార్త: ఐఎస్ సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలో నూతనంగా అభివృద్ధి చేసిన పార్కును యాకుత్‌పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మంగళవారం మాజీ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సూదిని చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపిడి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంపాపేటలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ

సర్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న కట్ట వెంకటేష్

సైదాబాద్, జూన్ 30 ప్రభాతవార్త: చంపాపేట హరిజనబస్తీలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు కట్ట వెంకటేష్ ఇంటింటికి తిరుగుతూ ఓటరు వెరిఫికేషన్ దరఖాస్తులు అందజేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఓటరు వెరిఫికేషన్‌లో పాల్గొనడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పోల్దాస్ లక్ష్మణ్, ఎండి షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న అమరవాది,చింతల.

వనస్థలిపురం జూన్.30.ప్రభాతవార్త. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం ఆధ్వర్యంలో వనస్థలిపురం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం లో మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు మరియు సర్వైకల్ క్యాన్సర్ పై ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఏర్పాటు చేశారు. ఈ